ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-11-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు.

- రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు.

- కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్రంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ పేర్కొంది.

- విశాఖలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న సీఐఐ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

==========

అర్హులైన ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కును పరిరక్షిస్తూ.. ఓటర్ల జాబితాలను పారదర్శకంగా ప్రక్షాళన చేయడమే భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రధాన ఉద్దేశమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. భీమవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఈరోజు మేధావులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదు చేసుకున్న వారి వివరాలను నిబంధనల ప్రకారం సరి చేయడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని కేంద్రమంత్రి వివరించారు.

==========

రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీశ్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. పరిషత్ ఎన్నికల సందర్భంగా 15 జిల్లాల పరిధిలో 37 ఘటనలు జరిగిగాయని ఆయన చెప్పారు. పోలింగ్ తో పాటు.. శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమని అన్నారు. ఇదిలా ఉండగా బ్యాలెట్ బాక్సులు ఉంచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని డీజీపీ తెలిపారు.

==========

పోలవరం జిల్లాలో ఈరోజు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలోని వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సాయంత్రం 5 గంటల వరకు ప్రాథమికంగా 63 శాతం పోలింగ్ నమోదైందని, సుమారు లక్షా 40 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలియజేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

==========

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్రంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో ఈరోజు నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాలు, పడకలు, వైద్య సిబ్బంది, అత్యవసర సామగ్రి, అనుమానిత కేసుల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. తిరుపతి, భోగాపురం, విజయవాడ విమానాశ్రయాల్లో ఎబోలా అనుమానిత లక్షణాలున్న వారికి స్క్రీనింగ్ చేసేందుకు వైద్య సిబ్బందిని సిద్ధం చేశామని తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు ఓడరేవుల్లోనూ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించామన్నారు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో సన్నద్ధతను పరీక్షించేందుకు ఈ నెల 12న మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

==========

విశాఖలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదస్సు నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువస్తుందని మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగరాభివృద్ధితో పాటు.. పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసే కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సీఐఐ సదస్సుకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను సంబంధిత విభాగాల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సదస్సు నిర్వహణకు సంబంధించి చేపడుతున్న వివిధ ఏర్పాట్లను పరిశీలించారు.

==========

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈరోజు ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించామని అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులతో ఎన్నికల సిబ్బంది పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి చేరుకున్నారు. ఎన్నికల సిబ్బంది నుంచి బ్యాలెట్ బాక్సులను అధికారులు స్వీకరించి, భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

విరామం

==========

విశాఖ జిల్లాలో MPTC ZPTC ఎన్నికల పోలింగ్ సరళిని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఈరోజు పరిశీలించారు. పద్మనాభం మండలం మద్ది హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. అదే విధంగా భీమిలి, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి మండలాల పరిధిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియను సంయుక్త కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. విశాఖపట్నం స్థానిక సంస్థల ఎన్నికల వ్యయ పరిశీలకులు పి.వి.సందీప్ రెడ్డి భీమిలి, పద్మనాభం, ఆనందపురం పెందుర్తి మండలాల్లోని కంట్రోల్ రూంలతో పాటు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

==========

కృష్ణా - గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు కావడానికి రేపటి వరకూ గడువు ఉందని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు వెంటనే ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైన ఉపాధ్యాయులు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం కొత్తగా ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గత ఎన్నికల సమయంలో 13 వేల 505 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటి వరకు 10 వేల 909 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు.

==========

ప్రకాశం జిల్లా కొత్తపట్నం తీరం వద్ద తమిళనాడుకు చెందిన మత్స్యకారుల బోటు ఈరోజు తీరానికి కొట్టుకు వచ్చింది. ఈ బోటులో ఉన్న ముగ్గురు మత్స్యకారుల మృతదేహాలను స్థానిక అధికారులు గుర్తించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఈ మృతదేహాలను పరిశీలించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ..

(వాయిస్ 24 సెకన్లు)

==========

ఓర్నాబ్ తుఫాను ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్లు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. భీమవరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో తుఫాను ప్రభావానికి గురైన 98 విద్యుత్ ఉపకేంద్రాల్లో పునరుద్ధరణ పనులు 100 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ప్రభావితమైన 67.. 33 కేవీ విద్యుత్ లైన్లలో 65 లైన్లను పునరుద్ధరించగా, మిగిలిన రెండు లైన్ల పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. అదే విధంగా 475 11 కేవీ విద్యుత్ లైన్లలో 472 లైన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. మిగిలిన మూడు లైన్లను కూడా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

==========

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో డిసెంబర్ 20 నుండి 29వ తేది వరకు 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో ఆయన ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత వైకుంఠ ఏకాదశి సందర్భంగా పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు రికార్డు స్థాయిలో 7 లక్షల 83 వేల మంది భక్తులకు దర్శనం కల్పించామని చెప్పారు. ఈసారి వైకుంఠ ద్వార దర్శనాలను కూడా విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు.

==========

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77 వేల 301 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 2009 పాయింట్ల లాభంతో 79 వేల 310 వద్ద ముగిసింది. నిఫ్టీ 576 పాయింట్లు లాభపడి 24 వేల 536 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94 రూపాయల 47 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 93.50 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

==========
==========